ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు


నిధులు రాక.. నిర్వహణ అస్తవ్యస్తం

- రైతు వేదికలను విస్మరించిన ప్రభుత్వం
- సొంతంగా ఖర్చులను భరిస్తున్న ఏఈవోలు
- రెండేళ్లుగా రాని నిధులు
- విద్యుత్ బిల్లులు కూడా కట్టలేని దుస్థితి
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



బెజ్జూరు, ఏప్రిల్ 19: అన్నదాతలకు అందుబాటులో ఉండేందుకు ఏర్పాటు చేసిన రైతువేదికల నిర్వహణ వ్యవసాయ విస్తరణ అధికారులకు తలకుమించిన భారంగా మారింది. గత ప్రభుత్వం రైతువేదికలను నిర్మించింది. అయితే వాటి నిర్వహణకు అవసరమైన నిధులు విడుదల చేయలేదు. దీంతో కనీసం విద్యుత్ చార్జీలు చెల్లించే పరిస్థితి లేదు. వ్యవసాయరంగంలో ఆధునిక పద్ధతులు, పంటల సాగులో వారికి అవసరమయ్యే సలహాలు, సూచనలు ఇవ్వడానికి 2021లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో క్లస్టర్ల వారీగా రైతు వేదికలకు నిర్మించారు. ఒక్కో రైతువేదికను రూ.22లక్షలతో నిర్మించారు. ఒక్కో వేదికకు వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించారు. వారు రోజు ఉదయం, సాయంత్రం వేదికల్లో అన్నదాతలకు అందుబాటులో ఉంటూ మిగితా సమయాల్లో క్షేత్ర సందర్శన చేసి సలహాలు, సూచనలు అందించాల్సి ఉంటుంది. వ్యవసా య అధికారులు రైతులకు అందుబాటులో ఉండేందుకు వీలుగా వేదికలో వసతి కల్పించారు.

ప్రత్యేకంగా ఫర్నీచర్‌ను సమకూర్చారు. శిక్షణ కార్యక్ర మాలకు అవసరమైన కుర్చీలు, మైకు వంటివి ఏర్పాటు చేశారు. వీటిని వ్యవసాయ శాఖతో పాటు ఇతరశాఖలు కూడా వినియోగించుకున్నాయి. ఊరికి దూరంగా నిర్మించిన వీటిలో పారిశుధ్యం తదితర పనులకు సహాయ కుడిని నియమిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ మాట మరిచిపోయింది. రైతు వేదికల్లోని విలువైన సామగ్రి దొంగల పాలవుతుండటంతో వ్యవసాయ విస్తరణ అధికారులే తమ సొంతఖర్చుతో వాచ్ మెన్లను ఏర్పాటు చేసుకున్నారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రస్తుతం వాటి నిర్వహణ పట్టించుకునే వారు లేరు.

కోట్లలో బకాయిలు..

రైతువేదికల్లో మంచినీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి నిర్వహణ ఖర్చుల నిమిత్తం ప్రతీనెల రూ.9వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ రెండేళ్లుగా నిధులు విడుదల చేయకపోవడంతో పలు ప్రాంతాల్లో సంబంధిత అధికారులు కొందరు వారి వేతనం నుంచి ఖర్చులు చెల్లించారు. 2022 ఏప్రిల్ నుంచి 2022ఆగస్టు వరకు ఐదు నెలలకు ఒక్కో రైతువేదికకు గాను రూ.45వేలు అందించింది. అటు తర్వాత నుంచి ఇప్పటి వరకు నిధులే లేవు. జిల్లాలో 70 రైతువేదికలు ఉండగా కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఒక్కో కేంద్రానికి ప్రభుత్వం రూ.1.35 లక్షలు బకాయి పడినట్లు లెక్క. కాగా దశాబ్ది ఉత్సవాల పేరిట చేపట్టిన కార్యక్రమాల్లోనూ కొందరు అధికారులు ఆవరణలు శుభ్రం చేయించడం, ఇతర పనులకు సొంతంగా డబ్బు చెల్లించాల్సి వచ్చింది.అందుకు ఒక్కో కేంద్రానికి కనీసం రూ.10వేలు వరకు ఖర్చయినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో చేసిన పనికి డబ్బులు ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తుందన్న ఆశ ఎలాగూ లేదు. కనీసం నెలవారి ఖర్చులైనా ఏ నెలకానెలా ఇవ్వకపోవడంతో రైతువేదికల నిర్వహణ గాడితప్పి లక్ష్యం నీరుగారుతోంది.

భారమైన నిర్వహణ..

నెలల తరబడి నిర్వహణకు నిధులు మంజూరు కాకపోవడంతో రైతువేదికల నిర్వహణ ఇబ్బందిగా మారింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో వ్యవసాయ విస్తరణ అధికారులే సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగింపు దశలోనైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఆశించారు. అయినా ప్రభుత్వ పరంగా ఎలాంటి స్పందన లేదు. మరో రెండు నెలల్లో వానాకాలం సీజన్ దృష్టిలో పెట్టుకొని నిధులు విడుదల చేయాల్సిన అవసర ముంది. రైతువేదిక నిర్వహణ నిధులపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయని కారణంగా తామే సొంతంగా డబ్బులు పెడుతున్నామని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

ఖర్చులు ఇలా..

రైతువేదికల నిర్వహణ వ్యవసాయ విస్తరణ అధికారులకు తలకు మించిన భారంగా మారుతోంది. విద్యుత్ చార్జీలకు రూ.1000, స్టేషనరీ జిరాక్స్‌లకు రూ.1000, శిక్షణా కార్యక్రమాలకు రూ.2500, తాగునీటి కోసం రూ.5010, పరిశుభ్రత, కాపలాదారు కోసం రూ.3000 ప్రతినెలా ఖర్చవుతున్నాయి. కరెంట్ బిల్లుల విషయంలో మరీ ఒత్తిడి పెరుగుతోంది. సకాలంలో బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని, దీంతో విధిలేని పరిస్థితుల్లో తామే డబ్బులు చెల్లిస్తున్నామని పేర్కొంటున్నారు. కనీసం మరుగుదొడ్ల నిర్వహణకు కూడా నిధులు లేవని అన్నీ తామే భరించాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. అధికారులకు ఈ విషయం చెబితే ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని మీరే భరించుకోవాలని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతు వేదికల నిర్వహణ మోయలేని భారంగా మారిందని వాపోతున్నారు.

ప్రతినెలా నివేదిక పంపిస్తున్నాం..

రాజులనాయుడు, ఏడీఏ, పెంచికలపేట



రైతువేదికల నిర్వహణకు సంబంధించి నిధుల కోసం ప్రతినెలా ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నాం. త్వరలోనే ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే అవకాశం ఉంది. రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. కొత్త ప్రభుత్వమైనా మా కష్టాలు గుర్తించి నిధులు విడుదల చేస్తుందని ఆశిస్తున్నాం.

మద్యం, డబ్బు అక్రమ రవాణాపై నిఘా ఉంచాలి

- ఎస్పీ సురేష్‌కుమార్


మాట్లాడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల కోడ్‌లో భాగంగా జిల్లాలో, సరిహద్దుల్లో మద్యం, నగదు అక్రమ రవాణాపై నిఘా ఉంచి పట్టుకోవాలని ఎస్పీ సురేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాలులో జిల్లాపోలీసు అధికారులతో సర్కిల్ వారీగా ఎస్పీ నెలవారి నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. నేరసమీక్షలో ఆయా పోలీసుస్టేషన్లలో నమోదైన కేసులలో అరెస్టుల పెండింగ్‌లకు గల కారణాలను తెలుసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నమోదైన కేసులలో కొన్ని కేసులు ఇంకా యూఐలో ఉండటానికి గల కారణాలను పరిశీలించారు. యూఐ కేసులకు అవసరమైన డీఎన్ఏ, ఎఫ్ఎస్ఎల్ మెడికల్ రిపోర్ట్‌ను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే తెప్పించుకొని కోర్టులో చార్జిషీట్ వేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల సంఘం సూచనలప్రకారం బాధ్యతగా విధులు నిర్వర్తించా లన్నారు. సమావేశంలో ఏఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ సదయ్య, కరుణాకర్, సీఐలు, ఎస్సైలు, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి

- డీపీవో భిక్షపతిగౌడ్


మాట్లాడుతున్న డీపీవో భిక్షపతిగౌడ్

కెరమెరి, ఏప్రిల్ 19: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో భిక్షపతిగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఝరి గ్రామ పంచాయతీని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై కార్యదర్శులు ప్రత్యేకదృష్టి సారించాలని అన్నారు. మురికి నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలని అలాగేవేసవిలో తాగునీటివనరులు ఎండిపోకుండా మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అరిట్టాలన్నారు. అనంతరం సావర్‌ఖేడలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయనవెంట ఎంపీడీవో కృష్ణారావు, ఎంపీవో అంజద్‌పాషా, కార్యదర్శులు వాజీద్, వికాస్ తదితరులు ఉన్నారు.

డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 19: విద్యాసంవత్సరం(2024-25)కి గాను దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులలో ప్రవేశానికి బాలికల నుంచి దరఖా స్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా స్త్రీశిశు, దివ్యాంగులు, వయోవృ ద్ధుల సంక్షేమశాఖ అధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన, నిరుపేద కుటుంబా నికి చెందిన, అణిచివేతకు గురైన దివ్యాంగ బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, సివిల్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్ ఎలక్లానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌కోర్సులలో 60సీట్లచొప్పున 240సీట్లు అందుబాటులో ఉన్నా యన్నారు. 10వతరగతి ఉత్తీర్ణులై ఉండి తల్లిదండ్రులను కోల్పోయిన అనాథబాలికలకు ప్రతికోర్సులలో 70శాతం, దివ్యాంగులకు మూడుశాతం రిజర్వేషన్ సీట్లు కేటాయిస్తామన్నారు.

జోరుగా తాటిముంజల విక్రయాలు

వాంకిడి, ఏప్రిల్ 19: మండల కేంద్రంలో తాటి ముంజల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వేసవితాపం నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు తాటిముంజల కొనుగోలుచేసేందుకు ఆసక్తిచూపుతున్నారు. మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చి 50రూపాలకు ఒకకాయ చొప్పున విక్రయిస్తు న్నారు. ఆరోగ్యంతోపాటు చల్లదనం కలిగే తాటి ముంజలకు మంచి గిరాకీ లభిస్తోంది. మండలకేంద్రంలో రహదారి పక్కన ముంజలు విక్రయిస్తుండడంతో వాహనదారులతోపాటు స్థానికులు వీటిని కొనుగోలు చేస్తున్నారు.


వాంకిడిలో విక్రయిస్తున్న తాటిముంజలు

ఆదిలాబాద్‌లో రెండవ రోజు ఒకే నామినేషన్

- ఆత్రం సుగుణ గెలవడం ఖాయం : ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు


రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఆదిలాబాద్, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి రెండవరోజు శుక్రవారం ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి ఆత్రంసుగుణ తరపున ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఆదిలాబాద్, బోథ్ ఇన్‌చార్జీలు కందిశ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కరీం, శ్రీలేఖతో కలిసి నామినేషన్ పత్రాలను జిల్లా రిటర్నింగ్ అధికారి రాజార్షిషాకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలవడం ఖాయమన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 15ఎంపీ సీట్లను సాధించడమే లక్ష్యమన్నారు. 5న్యాయసూత్రాలు, ఆరు గ్యారెంటీలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. జిల్లా చరిత్రలోనే కాంగ్రెస్ పార్టీ మొదటిసారిగా మహిళకు అవకాశం కల్పించిందన్నారు. అందులో ఆదివాసీ బిడ్డకు అవకాశం కల్పించడం ఎంతో అదృష్టమన్నారు. బీజేపీ మతం పేరుతో, దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ భిన్నత్వంలో ఏకత్వంలా అందరూ కలిసి మెలిసి ఉండాలని ఈ ప్రాంతాన్ని సమష్టిగా అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ముందుకు సాగుతోందన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'మహా' ఎన్నికలు


ఓటు వేసినట్లు సిరా చుక్క చూపిస్తున్న ఓటర్లు

కెరమెరి, ఏప్రిల్ 19: మండలంలోని రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో గల వివాదస్పద గ్రామాల్లో శుక్రవారం చంద్రాపూర్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఓటు వేసేందుకు పోలింగ్‌కేంద్రాలకు ఓటర్లు ఉత్సాహంగా వచ్చి తమ ఓటుహక్కు వినియోగించుకన్నారు. సాయం త్రం 6గంటలు దాటినప్పటికీ పోలింగ్ కేంద్రాల ముందు ఓటర్లుబారులు తీరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. 3357ఓటర్లు ఉండగా సాయంత్రం6 గంటల వరకు సుమారు 65శాతం పైగా ఓటర్లు తమఓటుహక్కు విని యోగిం చుకున్నట్లు మహారాష్ట్ర అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 19: మండలంలోని కౌట గూడ గ్రామంలో రెండు రోజుల క్రితం అగ్నిప్రమాదంలో నష్టపోయిన గెడం లక్ష్మణ్ కుటుంబాన్ని బీజేపీ సీనియర్ నాయకుడు జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు శుక్రవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన గెడెంలక్ష్మణ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట మాజీసర్పంచ్ లక్ష్మణ్, సురేష్ తదితరులు ఉన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు

అభ్యర్థుల ఖర్చుల వివరాలు నమోదు చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యయ పరిశీలకుడు డాక్టర్ వివేకానంద్ రాజేంద్ర జదావర్


వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎస్పీ తదితరులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 19: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్న రాజకీయపార్టీల అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల వ్యయపరిశీలకుడు డాక్టర్ వివేకానంద్‌రాజేంద్ర జదావర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్‌లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్‌లు, ఎన్నికల విభాగం అధికారులతో ఎన్నికలఖర్చులవివరాల నమోదు పర్యవేక్షణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలనేపథ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారంలో భాగంగా చేసే ప్రతి ఖర్చును తప్పనిసరిగా లెక్కించాలని తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సురేష్‌కుమార్, అదనపుకలెక్టర్ దాసరి వేణు, ఏఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాలకు ఓటింగ్ యంత్రాలు..

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు ఓటింగ్ యంత్రాలను ఆయాకేంద్రాలకు తరలించామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని వేర్‌హౌజ్‌లో భద్రపరిచిన ఓటింగ్‌యంత్రాలను అదనపు కలెక్టర్‌లు దీపక్‌తివారి, దాసరివేణు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేష్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఓటింగ్‌పరికాలు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. ముందుగా ర్యాండమైజేషన్ నిర్వహించి అనంతరం కేటాయించిన ఈవీఎంలను స్కానింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి391 బ్యాలటింగ్ యూనిట్లు, 391 కంట్రోల్ యూనిట్లు, 448 వీవీ ప్యాట్‌లు, సిర్పూర్ నియోజకవర్గానికి 352బ్యాలటింగ్ యూనిట్లు 352 కంట్రోల్ యూనిట్లు, 403 వీవీప్యాట్లను కంటైనర్ల ద్వారా పోలీసు బందోబస్తు మధ్య తరలించామని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని పీటీజీ పాఠశాలలో, సిర్పూర్ నియోజక వర్గానికి సంబంధించి కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో భద్ర పరుస్తామని తెలిపారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో పాటించాల్సిన నియమనిబంధనలను, మార్గదర్శకాలను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నాణ్యమైన పరికరాలు అందించాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 19: ఉద్యోగులకు నాణ్యమైన పరికరాలు అందించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఆర్పీ1గనిపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యాజమాన్యం అందించే నాసిరకమైన పనిముట్లతో పనులు చేయలేక ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నార న్నారు. ఎస్‌డీఎల్‌లో వాడే ఆయిల్ కూడా సరియైనది కొనడం లేదని, దీనివల్ల యంత్రాలు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. కార్యక్రమంలో ఉప ప్రధానకార్యదర్శులు కె వీర భద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, దాడి రాజయ్య, తదతరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 19: ఈనెల 21న గోదావరిఖనిలోని బృందావన్‌గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఐఎన్‌టీయూసీ మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర మినిమం వేజ్‌బోర్డు ఛైర్మన్ బి జనక్ ప్రసాద్ కోరారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకంల సమావేశంలో మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడతూ, మహాసభలో కార్మిక సమస్యలపై చర్చిస్తామని, పలు తీర్మాణాలు చేపడతామన్నారు. కార్మికలకుఇచ్చిన హామీలు నెరవేర్చుట, సింగరేణి భవిష్యత్తు, నిరుద్యోగుల కోసం పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు, కాంట్రాక్టుకార్మికుల వేతనాలు పెంపు, తదితర సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ సభకు యూనియన్ జాతీయ అధ్యక్షుడు బి సంజీవరెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు, కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు హాజరవుతారని అన్నారు. కార్మికులు, యూనియన్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్ రావు, సీనియర్ నాయకులు గరిగె స్వామి, సిహెచ్. భీంరావు, కలవేన శ్యామ్, పెట్టం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలో కార్మికుల సంక్షేమంపై తీర్మాణాలు

మందమర్రి టౌన్: ఈనెల21న గోదావరిఖనిలో జరిగే మహాసభలో కార్మి కుల సంక్షేమంపై పలు తీర్మాణాలు చేయనున్నారని ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం సింగరేణి సంస్థకోసం చేస్తున్న చేయూతను వివరిస్తామన్నారు. తాము సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న కాలంలో సాధించిన హక్కులను తెలియ జేస్తామన్నారు. ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్‌ప్రసాద్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. సభకు కార్మికులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అనేక అంశాల ప్రస్తావన..జనక్‌ప్రసాద్

గోదావరిఖనిలో జరిగే మహాసభలో కార్మికులకు సంబంధించి అనేక అంశాలను ప్రస్తావిస్తామని రాష్ట్ర కనీసవేతనాల మండలి ఛైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన సంక్షేమం తదితర వాటిని సభల్లో వివరిస్తారన్నారు. కార్మికుల సంక్షేమంపై తీర్మాణాలు చేస్తామని, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

శాంతిఖని గనిలో సైకిల్ ర్యాలీ

బెల్లంపల్లి, ఏప్రిల్ 19: బెల్లంపల్లిలోని శాంతిఖనిగనిలో శుక్రవారం అధికారులు, కార్మికులు సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ షాఫ్ట్‌నుంచి ఫ్యాన్‌హౌజ్ వరకు కొనసాగింది. ఈసందర్భంగా ప్రాజెక్టు అధికారి విజయప్రసాద్ మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ కోల్, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాల మేరకు సైకిల్‌ర్యాలీ నిర్వహించామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని, కొద్దిదూరానికి బైక్‌లు ఉపయోగించకుండా సైకిళ్లను వాడాలని సూచించారు. కార్యక్రమంలో గ్రూప్‌ఇంజనీర్ బసవరాజు, మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, పిట్ ఇంజనీర్ రాంబాబు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన సురేందర్ రెడ్డి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 19: టీబీజీకేఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి శుక్రవారం పెద్దపల్లిలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌లో చేరారు. మాజీ మంత్రి, పెద్దపల్లి నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. శుక్రవారం ఉదయం 200మంది కార్యకర్తలతో కె సురేందర్‌రెడ్డి పెద్దపల్లికి తరలివెళ్లారు. అక్కడ బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ సురేందర్ రెడ్డి తెలంగాణ సాధనలో ముందుండి పోరాడారని, సకలజనుల సమ్మెకు నాయకత్వం వహించారని, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పెట్టం లక్ష్మణ్, బండి రమేష్, పానగంటి సత్తయ్య, పుప్పాల సంపత్, తోంగల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి: జీఎం


మాట్లాడుతున్న జీఎం మనోహర్

కాసిపేట, ఏప్రిల్ 19: ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు కార్మికులందరూ రక్షణతో కూడినఉత్పత్తి సాధించాలని మందమర్రి జీఎం మనోహర్ అన్నారు. శుక్రవారం కాసిపేట 2వగనిలో మ్యాన్ రైడింగ్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, కార్మికులు కలిసికట్టుగా రక్షతోకూడిన విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. త్వరలోనే మ్యాన్ రైడింగ్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఇందుకు కార్మికులందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా రక్షణఅధికారి రవీందర్, కేకే గ్రూపుఏజెంట్ రాందాస్, ఇంజనీర్ రాంప్రసాద్, గనిమేనేజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

జైపూర్, ఏప్రిల్ 19: టేకుమట్ల ఎంపీటీసీ బడుగు రవి తండ్రి గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్ర వారం రవిని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ రాజార మేష్, రిక్కుల మధుకర్‌రెడ్డి, మేడి తిరుపతి ఉన్నారు.

సోషల్ వేల్ఫేర్ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు అస్వస్థత

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: సుల్తానాబాద్ పట్టణ శివారులో ఉన్న సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల వసతి గృహంలో 25 మంది విద్యార్థులకు అస్వస్థకు గురయ్యారు. హాస్టల్‌లో మొత్తం విద్యార్థుల సంఖ్య 480 మంది కాగా, గురువారం 372 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 20 మందికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి మొదలైంది. హాస్టల్‌లో సిబ్బంది వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ అనుపత్రికి తరలించారు. శుక్రవారం మరో ఐదు మంది విద్యార్థులకు కూడా ఇదే విధంగా వాంతులు, విరేచనాలు కావడంతో వారిని కూడా ఆస్పత్రికిలో చేర్చారు. పరీక్షలు ఉండడంతో కొంతవరకు కొలుకున్న వారిని శుక్రవారం ఉదయం హాస్టల్‌కు తరలించారు. పరీక్షల తర్వాత వారిని హాస్టల్‌లోని ఒక ప్రత్యేక గదిలో ఉంచి శుక్రవారం రాత్రి డాక్టర్ల సూచనల మేరకు కేవలం పెరగన్నం మాత్రమే అందించారు. గురువారం సాయంత్రం బొండాలు పెట్టారని, అవి తినలేని పరిస్థితిలో ఉన్నాయని, ఈ విషయం హాస్టల్ ఇన్‌చార్జి దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని, కొందరు వాటిని పడవేశారని, తిన్న తమకు వాంతులు, విరోచనాలు, విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

● హాస్టల్‌లో ఆహారం పడక కొంత మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకున్న సోషల్ వేల్ఫేర్ శాఖ రీజనల్ డైరెక్టర్ మేరీ ఏసుపాదం శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని, హాస్టల్‌లో ఉన్న వారిని పరామర్శించారు. ఇలా ఎందుకు జరిగిందని ఆరా తీశారు.

● మెనూ ప్రకారం పెడుతున్నాం..- సత్యప్రసాద్, ప్రిన్సిపాల్

మెనూ ప్రకారమే హాస్టల్‌లో భోజనం, టిఫిన్‌లు పెడుతున్నాం. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం కూడా బోండాలు పెట్టాం. బోండా పిండి కొంచెం పలుచగా రావడం వల్లన నూనె ఎక్కువ పీల్చుకోవడంతో అవి కొందరికి పడకపోయి ఉండవచ్చు. నాకు సమాచారం రాగానే హైదరాబాద్ నుంచి తెల్లవారుఝామున సుల్తానాబాద్ వచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నాం. డిశ్చార్జీ అయి వచ్చిన విద్యార్థులకు డాక్టర్ల సూచనల మేరకు కేవలం పెరుగన్నం అందిస్తున్నాం.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 19 : రాష్ట్రంలో త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మెజార్టీ స్థానాలు సాధిస్తుందని బీఆర్ఎస్ జిల్లా పట్టణ నాయకులు జె. రవీందర్, మేడిపల్లి సంపత్, ఓ. రాజశేఖర్‌లు తెలిపారు. శుక్రవారం మందమర్రిలో వారు మాట్లాడుతూ మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌దే విజయమని తెలిపారు. అనంతరం కొప్పుల ఈశ్వర్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా పెద్దపల్లికి తరలి వెళ్లారు.

పదవీ విరమణ ఉపాధ్యాయుడికి సన్మానం

కాసిపేట, ఏప్రిల్ 19: దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు వేముల దామోదర్‌రెడ్డి పదవీ విరమణ పొందగా శుక్రవారం పాఠశాల ఆవరణలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల నోడల్ అధికారి రాథోడ్ రమేష్ హాజరై మాట్లాడారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని కానీ చేసిన సేవలు ఎప్పుడు గుర్తుంటాయన్నారు. అనంతరం సన్మానించి జ్ఞాపికలు అందించారు. హెచ్ఎం సుధాకర్, రిటైర్డు హెచ్ఎం కృష్ణ భాస్కర్, నర్సింహారెడ్డి , బండి రమేష్‌రవికుమార్, గోపాల్, సురేష్‌బాలబు, అంజద్‌పాషా, లచ్చన్న, రాజేశం, అనిత, మహేష్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్ దరఖాస్తుకు 22 వరకు గడువు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలీసెట్-24) రాసేందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వ తేదీ వరకు గడువు ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శ ఆవాస మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు కరీంనగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శ మహిళా రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

నిందితుడి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 19: సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట వద్ద ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని పరీద్‌పేటకు చెందిన కోల రవిగౌడ్ (46)ను శుక్రవారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఇతను సిరిసిల్ల పట్టణంలోని సినారె గ్రంథాలయం, దామిని బార్ ఎదుట పార్క్ చేసిన రెండు ద్విచక్రవాహనాలను చోరీచేసి ఒక వాహనాన్ని చెట్ల పొదల్లో దాచిపెట్టి మరో వాహనంపై తిరుగుతండగా పట్టుకున్నామని తెలిపారు. చోరీ చేసిన రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని దొంగను కోర్టులో హాజరుపరచామని ఆయన తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ఏసీసీ, ఏప్రిల్ 19 : మంచిర్యాల పట్టణంలోని మంచిర్యాల-పెద్దంపేట రైల్వేస్టేషన్‌ల మధ్య వివాహిత రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లికి చెందిన కట్ట పారిజాత(59) అనారోగ్యం కారణాలతో జీవితంపై విరక్తి చెంది కాజీపేట నుంచి బల్లార్షా వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు కింద పడి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. జీఆర్‌పీ ఎస్‌ఐ సుధాకర్ ఆదేశాల మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తప్పిపోయిన మతి స్థిమితం లేని యువకుడు

ఏసీసీ, ఏప్రిల్ 19: మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మతి స్థిమితం లేని యువకుడు ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లి తప్పిపోయాడని ఎస్‌ఐ లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రటకటనలో తెలిపారు. చెన్నూరుకు చెందిన తగరం చిరంజీవి అనే యువకుడు ఈ నెల 15న ఫిట్స్ వ్యాధితో బాధపడుతూ మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరాడు. ఈ నెల 17న రాత్రి ఆసుపత్రి నుంచి ఒంటరిగా బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి ఆచూకీ దొరకక పోవడంతో కుటుంబీకులు మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేసవి క్రీడా శిబిరాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఏసీసీ, ఏప్రిల్ 19: జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిబిరాలు నిర్వహించడానికి ఆసక్తి గల సీనియర్ క్రీడాకారులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనీలు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు క్యాంపు నిర్వహణ, క్రీడా అంశాలను పేర్కొంటూ ఈనెల 26లోగా జిల్లా క్రీడా ప్రాదికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని డీవైఎస్‌వో కీర్తిరాజ్ వీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31 వరకు క్యాంపు నిర్వహించేందుకు ఆసక్తి గల వారు 9963539234లో సంప్రదించాలన్నారు.

నేత్ర వైద్య శిబిరం



కంటి ఆపరేషన్ల కోసం వెళ్తున్న పేషెంట్లు

నెన్నెల, ఏప్రిల్ 19: మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆవడంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పరీక్షలు నిర్వహించి వారిలో 28 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వారిని కరీంనగర్ జిల్లా రేకుర్తికి తరలించారు. అక్కడ ఉచితంగా ఆపరేషన్లు చేసి కంటి అద్దాలు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. గుర్రాల చక్రధర్‌రావు, చైతన్య చంద్రరాజు, మధూకర్, శ్రీధర్, రాజేష్, ఎం. రమేష్, కె. రజిని, వి. సాహితి పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

భీమారం, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం బూత్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన మధు, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సురేష్, మల్లేష్‌లు బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, పెద్దపల్లి కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ అక్కల రమేష్, నాయకులు బాపు, శ్రీధర్, శంకర్, శ్రీనివాస్, శంకర్, సురేష్, మధు, జనార్ధన్, పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ పూజలు

బెల్లంపల్లి, ఏప్రిల్ 19: పట్టణంలోని శంషీర్‌నగర్‌లోని పంచముఖి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. హైద్రాబాద్ నుంచి వచ్చిన వేద పండితుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ నిర్వాహకులు ఆనంద్‌లోయ, పింటులోయ, అర్చకులు మల్లోజుల విజయశర్మ, ధ్వజస్తంభం దాత రాగంశెట్టి సత్యనారాయణ, అన్నదాత చిప్ప మనోహర్, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మణ్‌రావు, ఇందూరి ప్రభాకర్ పటేల్, దెబ్బటి రమేష్‌పటేల్, కుంబాల రాజేష్, కోయిల్‌కార్ గోవర్ధన్, రాజశేఖర్, శ్రీరాములు పాల్గొన్నారు.

ఏసీసీ: పట్టణంలోని రాళ్లపేట గౌతమినగర్‌లో నిర్మించిన శివ పంచాయతన సహిత అభయాంజనేయ సరస్వతి సుబ్రమణ్యస్వామి దేవాలయంలో



బెల్లంపల్లిలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు, మంచిర్యాలలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు

దేవతల విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఉదయం యగ్న వాటిక, హోమ గుండాలను సిద్ధం చేసి దేవతామూర్తులను మేళతాళాలతో ఆలయం ప్రాంగణానికి తీసుకువచ్చారు. వేద పండితులు మధుశంకర్ శర్మ, కొత్తపల్లి భరద్వాజశర్మ, రాంబట్ల శశంక్‌శర్మల ఆధ్వర్యంలో పూజలు వైదిక క్రతువు చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలు ఆదివారం వరకు జరగనున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

ఈశ్వర్ నామినేషన్‌కు తరలిన నాయకులు



రామకృష్ణాపూర్ నుంచి వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోటపల్లి, ఏప్రిల్ 19: పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్ శుక్రవారం నామినేషన్ సమర్పించగా మండలానికి చెందిన పార్టీ నాయకులు పలువురు తరలివెళ్లారు. నాయకులు కొట్టె నారాయణ, రాళ్లబండి శ్యాం, కంకణాల సంపత్‌రెడ్డి, అజ్మీర పున్నం, మాంతయ్యల ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. అంతకుముందు మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు.

రామకృష్ణాపూర్: కొప్పుల ఈశ్వర్ నామి నేషన్ వేస్తున్న సందర్భంగా డా. రాజా రమేష్, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 250 మంది పెద్దపల్లికి తరలివెళ్లారు. నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంతం పై అవగాహన ఉన్నకొప్పుల ఈశ్వర్‌ను పెద్దపల్లి ఎంపీగా గెలిపించుకోవాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటే ఈశ్వర్‌ను గెలిపించుకోవాలన్నారు.

దండేపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నామినేషన్ కార్యక్రమానికి శుక్రవారం మండలం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు పెద్దపల్లికి తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సమక్షంలో ప్రత్యేక వాహనాల్లో వెళ్ళినట్లు పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసర్తి అనిల్‌కుమార్‌లు తెలిపారు.

వంశీ నామినేషన్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



పెద్దపల్లిలో మందమర్రి కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 19: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీవివేక్ శుక్రవారం నామినేషన్ వేస్తున్న సందర్భంగా పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో పెద్దపల్లికి తరలివెళ్లారు. నాయకులు సొత్కు సుదర్శన్, నోముల ఉపేందర్‌గౌడ్, గడ్డం రజనీలు మాట్లాడుతూ వంశీవివేక్ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కాకా కుటుంబానికి పెద్దపల్లి పార్లమెంట్‌తోఉన్న అనుబంధం మరువలేనిదన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి



నస్పూర్ కాలనీలో ప్రచారం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

నస్పూర్, ఏప్రిల్ 19: పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ కోరారు. గోదావరి కాలనీలో శుక్రవారం రఘునాథ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి నుంచి బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎక్కడ పోయాయని రఘునాథ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ నియోజకవర్గంలో దళితులు లేనట్టుగా ఒకే కుటుంబానికి రెండు ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ సీటు కేటాయించి మిగతా దళితులను అవమానించారని ఆరోపించారు. నాయకులు కమలాకర్ రావు, మధు, కుర్ర చక్రి, ఈర్ల సదానందం, కొయ్యాడ పద్మ, అనూష, మౌనిక, జ్యోతి, మహేందర్ పాల్గొన్నారు.

దండేపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు గోపతి రాజయ్య, ఎంబడి సురేందర్, మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు అక్కల దివ్యలు ధీమా వ్యక్తం చేశారు. మామిడిపల్లి, కాసిపేట, చింతపల్లి గ్రామాల్లో శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీ అధికారంలో ఉంటేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. నాయకులు పత్తిపాక సంతోష్, గాలిపెల్లి సత్యనారాయణ, నలిమెల మహేష్, యుగేందర్, దయ్యాల వెంకటేష్, శ్యామల స్వామి, లచ్చన్న, రాజేష్, శ్రీధర్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: మండలంలోని రాయిపేటలో బీజేపీ నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. బూత్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు

ఏసీసీ, ఏప్రిల్ 19: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదైంది. ఈ నెల 17న శ్రీరామనవమిని పురస్కరించుకుని పాత మంచిర్యాలలోని రామాలయాన్ని సందర్శించి సీతా రాముల కల్యాణంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆలయానికి లక్ష రూపాయల నగదును విరాళంగా అందించారు. కోడ్ అమలులో ఉండగా విరాళం ఇచ్చినందుకు ఎన్నికల నియామవళి ఉల్లంఘన కింద కేసు నమోదైనట్లు ఆర్డీవో వడాల రాములు తెలిపారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో

భీమారం, ఏప్రిల్ 19: భీమారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను శుక్రవారం డీఈవో యాదయ్య సందర్శించారు. వార్షిక పరీక్షలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ తరగతి ఉపాధ్యాయులు వివిధ సబ్జెక్టుల్లో ఏ రోజు పేపర్ ఆ రోజే మూల్యాంకనం చేసి ఈ నెల 23న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిల్లులు వెంటనే విడుదల చేయాలి

భీమారం, ఏప్రిల్ 19: రావాల్సిన బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నానని, ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కొత్తపల్లి మాజీ సర్పంచు గోదారి తిరుపతి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మన ఊరు మన బడి ప్రణాళికలో భాగంగా కాంపౌండ్ వాల్, టాయిలెట్‌లు, సంపు నిర్వహణ, లైట్లు తదితర పనులు చేయగా కొన్ని బిల్లులు వచ్చాయని, మిగితా రూ.2 లక్షలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నానని తెలిపారు. డబ్బులు విడుదలైనా గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఇవ్వకుండ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీడీవో రాథోడ్ రాధను వివరణ కోరగా సర్పంచుల చెక్ పవర్ రద్దు కావడంతో గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన మొదలైందని, అన్ని గ్రామాల్లో అకౌంట్‌లు ఓపెన్ చేశారని, త్వరలోనే డబ్బులు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

భీమారం, ఏప్రిల్ 19 : భీమారానికి చెందిన లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ శ్రీనివాస్ నాయక్ శుక్రవారం ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రవి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

కోటపల్లి, ఏప్రిల్ 19: ఎండ తీవ్రత దృష్ట్యా శుక్రవారం హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ కోటపల్లిలో పలువురి కూలీలు, గ్రామస్తులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించారు. కూలీలు ఉదయం వేళనే పనులకు వెళ్లాలని, ఎండ తీవ్రత ఉన్న సమయంలో ఇంటి వద్దే ఉండాలని సూచించారు. ఓఆర్‌ఎస్ వల్ల డీహైడ్రేషన్ తగ్గుతుందని వీటిని ఉపయోగించుకోవాలని కోరారు.

బీజేపీ బూత్ కమిటీల ఏర్పాటు

కోటపల్లి, ఏప్రిల్ 19: మండలంలోని పుల్లగామ, అల్గామ గ్రామాల్లో శుక్రవారం బీజేపీ బూత్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు పార్టీ నాయకులు మంత్రి రామయ్య, కందుల వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతీ గ్రామానికి పది మంది సభ్యులతో కూడిన కమిటీలు, మహిళ, మోర్చా తదితర కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నర్సింహులు, మహేష్, రాజేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

పాసిగాంలో పూలాజీ బాబా ధ్యానకేంద్రం లేదు

● పూలాజీ బాబా ముఖ్య సంస్థాన్ పాట్నాపూర్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్

జైనూర్, ఏప్రిల్ 19: రెబ్బెన మండలం పాసిగాంలో పూలాజీ బాబా ధ్యానకేంద్రం లేదని పూలాజీబాబా ముఖ్యసంస్థాన్ పాట్నాపూర్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాట్నాపూర్ సిద్దేశ్వర్ సంస్థాన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెబ్బెన మండలం పాసిగాం గ్రామంలోని భీంరావు బాబాఆశ్రమాన్ని పూలాజీబాబా ఆశ్రమంగా పేర్కొనడం సరికాదన్నారు. ఆగ్రామంలో పూలాజీబాబా ధ్యానకేంద్రమే లేదన్నారు. పూలాజీ బాబా ధ్యానకేంద్రంగా ఒక చానల్‌లో వార్త ప్రసారం చేయడంతో వాస్తవం లేదన్నారు. అక్కడబాలుడి మృతికి ఎలాంటిసంబంధం లేదన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శులు డుక్రే సుభాష్, మగాడే ప్రకాష్, దాదారావు, జనార్ధన్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ మున్సిపాల్టీకి రూ.34.65కోట్ల నిధులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 19: పురపాలక సంఘాల్లో తాగునీటి, భూగర్భ మురుగునీటి వ్యవస్థల ఏర్పాటును పటిష్టం చేసేందుకు అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెటు ఫండ్‌కు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారంరోజుల క్రితం ఆమోదంతెలిపింది. ఈనేపథ్యంలో నేషనల్ హౌజింగ్ బ్యాంకురుణంగా తెలంగాణలోని 11మున్సిపాల్టీలకు రూ.2524కోట్ల రుణానికి క్లియరెన్స్ ఇచ్చింది. ఇందులో భాగంగా కాగజ్‌నగర్ మున్సిపాల్టీకి రూ.34.65 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో తాగునీటి వ్యవస్థ పటిష్టపరిచేందుకు తగినచర్యలు తీసుకోనున్నారు. పట్టణంలో మరో వాటర్‌ట్యాంక్ నిర్మిం రెండు పూటల నీరు ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఎంపీ ఎన్నికలు ఉండటంతో పనులను ఎన్నికల అనంతరం చేపట్టనున్నారు.

అన్నదాన సత్రానికి ఏమీ ఇవ్వలేదు

● రైస్‌మిల్లర్స్ అసోసియేషన్

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 19: కాగజ్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కోనప్ప నిర్వహిస్తున్న అన్నదాన సత్రానికి తాము ఎటువంటి నిధులు కానీ, బియ్యం కానీ ఇవ్వలేదని జిల్లా రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల రైస్‌మిల్లర్స్‌పై కాంగ్రెస్, బీజేపీనాయకులు ఆరోపణలుచేసుకోగా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. రైస్ మిల్లర్స్ ద్వారా 2022-23 సంవత్సరానికి బియ్యం పూర్తిస్థాయిలో ఇవ్వడంతోనే తమకు సీఎస్సీ అనుమతి వచ్చిందన్నారు. తమను ఏ రాజకీయ నాయకుడు డబ్బులు అడగలేదని రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ సంఘం ప్రకటనలో పేర్కొంది.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 19: అప్రమత్తతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని లీడింగ్ ఫైర్‌మ్యాన్ సంపత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సినిమాథియేటర్ ఫంక్షన్‌హాల్‌లో, సూపర్‌మార్కెట్‌లో అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా ప్రమాదాల నివారణకు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఫైర్‌సిబ్బంది నరసింగరావు, మహేష్, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రం సుగుణ గెలుపునకు కృషి చేయాలి

● మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

దహెగాం, ఏప్రిల్ 19: కాంగ్రెస్‌పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఆయనవెంట జడ్పీటీసీ శ్రీరామరావు, వైస్‌ఎంపీపీ సురేష్, సంతోష్‌గౌడ్, మోహన్ పాల్గొన్నారు.

రేపు ఉచిత మానసిక వైద్యశిబిరం

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 19: కాగజ్‌నగర్‌లోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో ఈనెల21 ఆదివారం ఉచిత మానసిక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్కహాల్, డిప్రెషన్, ఆందోళన, మానసిక ఇబ్బందులు తదితర సమస్యలపై మంచిర్యాల మైండ్ మ్యాటర్స్ న్యూరో సైక్రియాట్రీ సెంటర్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రవి వర్మ, డాక్టర్ సాయలక్ష్మి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 8గంటల నుంచి నిర్వహించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే హరీష్‌బాబుపై పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు

సిర్పూర్(టి)/పెంచికలపేట/దహెగాం/చింతలమానేపల్లి/కౌటాల, ఏప్రిల్ 19: మంత్రి సీతక్క, సిర్పూర్ నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాస్, మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్పపై అసత్య ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుపై శుక్రవారం పలు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆయన చేసిన అసత్య ఆరోపణలు వెనక్కి తీసుకోవాలన్నారు. పెంచికలపేటలో నాయకులు బండన్న, శ్రీనివాస్, తిరుపతి, భాస్కర్, సంజీవ్, లచ్చన్న, రాజన్న, బాబు, దహెగాంలో వెంకటేష్, తోగేష్, శ్రీనివాస్, సురేష్, భీమన్న, వెంకన్న, పవన్, రవి, చింతలమానేపల్లిలో నాయకులు కనకయ్య, శేఖర్, శంకర్, మహేష్, పోశన్న, శంకర్ తదితరులు ఫిర్యాదుచేసిన వారిలో ఉన్నారు.

సిర్పూర్(టి)లో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుపై చర్యలు తీసుకోవాలని పేదరిక నిర్మూలనసమితి నాయకులు చంద్రగిరి సుదర్శన్ తహసీల్దార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు.



సిర్పూర్(టి)లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 19: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అంకుశాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మెంగ్రే గౌరిబాయి(36)ని కొన్ని రోజులుగా భర్తతిరుపతి వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గొంతుపిసికి కడుపులో తన్నడంతో బాధితురాలు గురువారం గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వెంటనే ఆసిఫాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లి పుంజుబాయి ఫిర్యాదు మేరకు తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు

నగదు పట్టివేత

వాంకిడి, ఏప్రిల్ 19: మండలంలోని టోల్ ప్లాజా చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.71,500నగదు పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాకు చెందిన గొడిసెలవార్ నరేందర్ కారులో సిద్దిపేట వైపు వెళ్తుండగా తనిఖీచేయగా ఎలాంటి పత్రాలు లేని రూ.71,500నగదు పట్టుబడినట్లు తెలిపారు. నగదును సీజ్‌చేసి ఎఫ్ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు తెలిపారు.

జైనూరులో బీఆర్‌ఎస్ ప్రచారం షురూ

జైనూర్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ ఎంపీఅభ్యర్థి ఆత్రంసక్కు గెలుపుకోసం సిర్పూర్ (యు) జడ్పీటీసీ కోవ అరుణ, ఎంపీపీ తోడ్సం భాగ్యలక్ష్మి, శుక్రవారం మండలంలోని కాలేజీగూడలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆత్రం సక్కు గెలుపు కోసం నాయకులు ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ కోవ అరుణ, ఎంపీపీ తోడ్సం భాగ్య లక్ష్మి మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి ఆత్రం సక్కును భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈసారి జరుగుతున్న ఎన్నికలు బడుగులకు అగ్నిపరీక్ష లాంటివన్నారు. పార్లమెంట్ ఎన్ని కల్లో అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించి సత్వర న్యాయం కోసం ఢిల్లీ పార్లమెంట్‌లో అడుగు పెట్టేలా కృషి చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ కనక యాదవ్‌రావ్, సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్, వైస్‌ఎంపీపీ చీర్లే లక్ష్మణ్, తోడ్సం ధర్మారావ్, ఇంతీయాజ్‌లాల, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

కాలినడకన కొండగట్టుకు పయనమైన భక్తులు

జైనూర్, ఏప్రిల్ 19: మండలంలోని భుసిమెట్ట ముక్కెరగూడలో శుక్రవారం హనుమాన్ భక్తులు కొండ గట్టుకు బయలుదేరారు. ప్రత్యేకపూజలు నిర్వహిస్తూ భక్తి శ్రద్ధలతో పాటలు, నృత్యాలు చేస్తూ కొండగట్టుకు తరలివెళ్లారు. ఎండలను లెక్కచేయకుండా కాలినడకన భక్తులు కొండగట్టుకు తరలివెళ్లడం వారిలోని భక్తి నిదర్శనమని గ్రామస్థులు, సర్పంచ్ కోట్నాక మోతు బాయి అన్నారు. ఇలాంటి భక్తి గుణాలు అందరిలో వచ్చినప్పుడే సమాజంలో శాంతి ప్రసరిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు కోట్నాక మాధవ్‌రావ్, కోట్నాక భగ్వంత్‌రావ్, భక్తులు పాల్గొన్నారు.



కొండగట్టుకు బయలు దేరిన హనుమాన్ భక్తులు

నాగమ్మ చెరువులో కోళ్ల వ్యర్థాలు

● ఇబ్బందులు పడుతున్న సందర్శకులు, ప్రజలు
● డంపింగ్ యార్డు నిర్మించినా ఉపయోగించని వైనం

సిర్పూర్(టి), ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని చికెన్‌సెంటర్ల వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను సంచుల్లో నింపి నాగమ్మ చెరువులో పడవేస్తున్నారు. దీంతో నాగమ్మ చెరువులోని బుద్ధుడి విగ్రహం సందర్శనకు వచ్చే వారు, సమీపంలోని మసీదుకు, వారసంత వచ్చే వ్యాపారులు, ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతోపాటు కుళ్లిపోయిన కోళ్ల వ్యర్థాలను కుక్కలు, పందులు తిని చనిపోతున్నాయి. ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ అధికారులకు, ప్రత్యేకాధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదని మండలవాసులు ఆరోపిస్తున్నారు. చికెన్‌సెంటర్ యజమానులకు ఊరి బయట ఈజీఎస్ పథకంలో డంపింగ్ యార్డు నిర్మించి ఇచ్చినప్పటికీ ఆ యార్డులో వ్యర్థాలను పడేయకుండా మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో పడేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నాగమ్మ చెరువులో పడేసిన కోళ్ల వ్యర్థాలు

జిల్లాలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

ఆసిఫాబాద్,ఏప్రిల్ 19: జిల్లాలో శుక్రవారం 44.6డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు అయింది. కాగజ్‌నగర్‌లో 44.6డిగ్రీలు, దహెగాంలో 44.1డిగ్రీలు, బెజ్జూరులో 44.0డిగ్రీలు, తిర్యాణిలో 43.9డిగ్రీలు, పెంచికలపేటలో 43.6డిగ్రీలు, రెబ్బెన,కౌటాలలో 43.5 డిగ్రీలు, కెరమెరిలో 43.4డిగ్రీలు, సిర్పూర్(టి)లో 43.2డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడిగా ఎంఏ రఫీక్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 19: ఆసిఫాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎంఏ రఫీక్‌ను నియమిస్తూ శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు నియామక పత్రాన్ని అందజేశారు. రఫీక్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచుకుని పట్టణాధ్యక్షుడిగా నియమించిన జిల్లాఅధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలేష్‌గౌడ్, చరణ్, దీపక్, శ్యాం, ఆసిఫ్ అలీ, ఆసాద్, శివరాం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 19: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వారిఆదేశాల మేరకు మే1 నుంచి 31వరకు జిల్లాలో సమ్మర్‌కోచింగ్ క్యాంపునిర్వహిస్తామని డీవైఎస్‌వో రమాదేవి తెలిపారు. శిక్షణశిబిరాల కోసం సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆసక్తిగల వారు పీడీ, పీఈటీలు ఈనెల2లోపు డీవైఎస్ఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.వివరాలకు 80008090626ను సంప్రదించాలన్నారు.

ఘనంగా పూలాజీ బాబా ధాన్యకేంద్రం వార్షికోత్సవం

వాంకిడి, ఏప్రిల్ 19: మండలంలోని ఇందాని గ్రామంలో పూలాజీబాబా ధ్యానకేంద్ర వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలాజీ బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు .కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి కోట్నాక విజయ్‌కుమార్, ప్రవచకులు భగవంతరావు, నారాయణ, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

ఆసిఫాబాద్, ఏప్రిల్ 19: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ దీక్షాపరులు గురువారం రాత్రి అఖండహనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడు శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గుండా వెంకన్న, వివేక్, రాధాకృష్ణ, రాజు, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 19: హనుమజ్జయంతి పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయకమిటీఆధ్వర్యంలో ఈనెల21న పట్టణంలో హనుమాన్ శోభయాత్రను నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

29న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

లింగాపూర్, ఏప్రిల్ 19: ఈనెల 29న కెరమెరి మండల కేంద్రంలో నిర్మించిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లింగాపూర్ అంబేద్కర్ మెమోరియల్ అసోషియేషన్ సభ్యులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆవిష్కరణ కార్యాక్రమ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శంకర్ మగ్రే, మిలింద్ మానే, తదితరులు పాల్గొన్నారు.



నిప్పులకొలిమి

- జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- ఆరెంజ్ హెచ్చరికలతో అప్రమత్తం
- ఉదయం 8 గంటల నుంచే సూర్య ప్రతాపం
- బయటకు రావాలంటేనే జంకుతున్న జనం
- సింగరేణి గనులపై పరిస్థితి దయనీయం

వారం రోజుల్లో నమోదైన ఉష్ణోగ్రతలు

జిల్లాలో గడిచిన వారం రోజుల్లో నమోదైన ఉష్ణోగతల వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 11న 40 డిగ్రీలు, 12న 35.9 డిగ్రీలు, 15న 42.6 డిగ్రీలు, 16న 42.9 డిగ్రీలు, 17న 44 డిగ్రీలు, 18న 45.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం భీమారం మండలంలో 44.9 డిగ్రీలు, నస్పూరు మండలంలో 44.5 డిగ్రీలు, బెల్లంపల్లి మండలంలో 44.4 డిగ్రీలు, జన్నారం మండలంలో 44.2 డిగ్రీలు, కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టులో 44.1 డిగ్రీలు, కోటపల్లి మండలంలో 44.1 డిగ్రీలు, జైపూర్ మండలంలో 43.9 డిగ్రీలు, వేమనపల్లి మండలంలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మంచిర్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. సూర్య ప్రతాపానికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఉదయం 8 గంటలకే వాతావరణం వేడెక్కుతుండటంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. ముఖ్యంగా పగటిపూట ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుకుంటుండటంతో ఎండ వేడిమిని తాళలేక పోతున్నారు. వారం రోజులుగా విపరీతమైన ఎండలతో ప్రజలు సతమతమవుతున్నారు. నాలుగైదు రోజులుగా జిల్లాలో సగటు ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు నమోదవుతోంది. రెండు రోజులుగా సాయంత్రం 4 గంటల తర్వాత వాతావరణం మబ్బులు పడుతుండటంతో ఎండ వేడిమి తగ్గి కొంతమేర ఉప శమనం కలుగుతోంది.

క్రమేపీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాలో వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా పగటి వేళలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఏప్రిల్ నెలలోనే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండడం ఆందోళనకు రేకెత్తిస్తోంది.

జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి ఏరియాల్లో అండర్ గ్రౌండ్ బొగ్గు బావులతోపాటు ఓపెన్‌కాస్టు మైన్‌లు అధిక సంఖ్యలో ఉండడంతో ఇక్కడి వాతావరణం వేడుక్కుతోంది. చిన్న చిన్న అవసరాలకు కూడా బయటకు వెళ్లలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కపోతకు గురవుతుండగా సామాన్య జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాల పై బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకాల్సిన పరిస్థితులు నెల కొన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం ఎండలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి.

బొగ్గు గనుల్లో పరిస్థితి దయనీయం

క్రమేపీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. సెకండ్ షిఫ్టులో విధుల్లోకి వెళ్లే కార్మికులు ఎండల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. మొదటి షిఫ్టు పూర్తి చేసుకున్న వారు సైతం మండుటెండలో ఇళ్లకు వెళ్లాల్సి వస్తోంది. సాధారణ ప్రాంతాలతో పోల్చితే బొగ్గు గనులు ఉన్న ఏరియాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఓపెన్ కాస్టు గని కార్మికులు ఎండవేడికి కుదేలవుతున్నారు. దీంతో పని వేళల్లో మార్పులు చేయాలనే డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. గతంలో వేసవి ఎండలకు సింగరేణిలో పనివేళల్లో మార్పులు చేసేవారు. పదేళ్లుగా ఆ పద్ధతికి స్వస్తి పలకడంతో కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణ రోజుల్లో ఫస్ట్ షిఫ్ట్ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సెకండ్ షిఫ్ట్ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుంది. అయితే ఎండలు పెరిగినప్పుడు పై రెండు షిఫ్టుల్లో పని వేళలను యాజ మాన్యం గంట ముందుకు మార్చేది.

అలా ఫస్ట్ షిఫ్ట్ ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రెండో షిఫ్టను సాయంత్రం 4 నుంచి రాత్రి 12 గంటల వరకు మార్పులు చేసేవారు. దీంతో ఎండవేడి నుంచి కార్మికులు ఉపశమనం పొందేవారు. గతంలోలాగే పని వేళల్లో మార్పులు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.



బీసీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న నాయకులు

నస్పూర్, ఏప్రిల్ 19 : జిల్లా కేంద్రంలో బీసీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని శుక్రవారం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జిల్లా కేంద్రాల్లో బీసీ భవనాలు నిర్మిస్తామన్నారని పేర్కొన్నారు. అధికారం చేపట్టి నాలుగు నెలలు గడుస్తున్నా బీసీ భవనాల ఊసే లేదని, ప్రభుత్వం త్వరితగతిన స్థలం కేటాయించి భవనాల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలన్నారు. పట్టణ అధ్యక్షుడు బొడెంకి మహేష్, జిల్లా నాయకులు జైపాల్ సింగ్, నాయకులు అంకం సతీష్, కొంతం రాజు, అరేందుల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు

జైపూర్, ఏప్రిల్ 19 : గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం రామారావుపేట గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్లపై ప్లాస్టిక్ ,చెత్తా, చెదారం లేకుండా శుభ్రం చేయించాలని కార్యదర్శికి సూచించారు. ఎండాకాలంలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున నీటి సమస్య లేకుండా చూడాలని, నీటి సమస్య ఉంటే తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, కార్యదర్శి సుమన్ తదితరులు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీటీడీవో

కాసిపేట, ఏప్రిల్ 19: మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలను డీటీడీవో గంగారాం శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం రిజిష్టర్‌లను, భోజన మెనూను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం ఎస్‌ఏ 2 పరీక్షలను పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ముందు నుంచే సిద్ధం కావాలని సిబ్బందికి సూచించారు. ఆశ్రమ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి పాఠశాలలో అడ్మిషన్‌లు పొందే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఏసీఎంవో రాజమౌళి, ప్రధానోపాధ్యాయుడు నర్సింహా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న సుమలత



సుమలతను సన్మానిస్తున్న అధ్యాపకులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 19: మందమర్రి పట్టణానికి చెందిన గాదం సుమలత డాక్టరేట్ అందుకున్నారు. శ్రీ సత్య సాయి యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్సెస్ మధ్యప్రదేశ్ నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో డెవలప్‌మెంట్ ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ ఎక్స్‌ట్రాక్షన్ మోడల్ ఫర్ సైంటిఫిక్ ఆర్టికల్స్ యూజింగ్ మిషన్ లెర్నింగ్ టెక్నిక్స్‌లో పరిశోధన పూర్తి చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. దీంతో ఆమెకు డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం హైద్రాబాద్‌లోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సుమలత అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ రావడంతో అధ్యాపకులు శుక్రవారం సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సన్మానించారు.

జంతుశాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్



కృష్ణగోపాల్‌రావు

చెన్నూరు, ఏప్రిల్ 19: కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న దారిశెట్టి కృష్ణగోపాల్‌రావుకు డాక్టరేట్ వచ్చినట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి శుక్రవారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్ పూర్‌లోని గ్లోకల్ యూనివర్శిటీ నుంచి జంతుశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీని ప్రదానం చేశారన్నారు. ఆచార్యులు డాక్టర్ వశీందర్‌సింగ్, అసిస్టెంట్ ప్రొఫె సర్ పర్యవేక్షణలో పునరుత్పత్తి ఆరోగ్యం గురించి కౌమార అవగాహన వైఖ రిపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ వచ్చినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

జబల్‌పూర్- మధురై ప్రత్యేక రైలు

బెల్లంపల్లి, పెద్దపల్లిలో హాల్టింగ్

పెద్దపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జబల్‌పూర్ నుంచి మధురై వరకు నడుస్తున్న వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలుకు బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రైలు ఈ నెల 18 నుంచి 25 వరకు జబల్‌పూర్ నుంచి మధురై వరకు, ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు మధురై నుంచి జబల్‌పూర్ వరకు నడవనున్నది. మొత్తం 22 రైల్వే స్టేషన్లలో ఈ రైలుకు హాల్టింగ్ సౌకర్యం కల్పించగా అందులో తెలంగాణలో బెల్లంపల్లి, పెద్దపల్లి జంక్షన్, వరంగల్, ఖమ్మం స్టేషన్లలో ఆగనున్నది. ఈ రైలు జబల్‌పూర్ నుంచి మదురైకి వెళ్లేటప్పుడు పెద్దపల్లి జంక్షన్‌కు ప్రతి శుక్రవారం ఉదయం 3:50 గంటలకు రానున్నది. మధురై నుంచి జబల్‌పూర్‌కు వెళ్లేటప్పుడు ప్రతి ఆదివారం రాత్రి 7:40 గంటలకు రానున్నదని దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ రైలు వల్ల మదురై మీనాక్షి అమ్మవారిని, తిరుచురాపల్లి దగ్గరలోని శ్రీరంగం దివ్య క్షేత్రంను దర్శించుకునేందుకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుంది.

రేపు సీసీసీలో జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు

నస్పూర్, ఏప్రిల్ 19: సీసీసీ రాయల్ టాకిస్ సమీపంలోని కుమార్ గన్నర్ అకాడమీలో ఈ నెల 21న జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు ఏర్పాటు చేసినట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాదం రవీందర్, కార్యదర్శి బోయిని రాజ్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ విజయం సాధించిన క్రీడాకారులు ఈ నెల 26న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పురుషులు, మహిళలకు వివిధ కేటగిరీల్లో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయి యూత్ మెన్, వుమెన్ బాక్సింగ్ పోటీలకు అర్హత కలిగిన క్రీడాకారులు ఆధార్, పుట్టిన తేది, ధ్రువపత్రాల జిరాక్స్ రెండు పాస్‌ఫొటోలు తీసుకురావాలన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మందమర్రిరూరల్, ఏప్రిల్ 19: వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యుడు రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రగుంటపల్లెలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మాట్లాడుతూ ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లోనే బయటకు వెళ్లాలని, ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు బయటకు వెళ్లవద్దని సూచించారు. నీరు, ఓఆర్ఎస్, మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలని సూచించారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. సీహెచ్‌వో గంగాధర్, ఏఎన్ఎం పద్మావతి, రాజేశ్వరి, రమేష్, పాల్గొన్నారు.

రెండో రోజు మూడు నామినేషన్లు దాఖలు





నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి రెండో రోజు శుక్రవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నామినేషన్ దాఖలు చేయగా, ఆయన వెంట పెద్దపల్లి, రామగుండం, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, దుర్గం చిన్నయ్య ఉన్నారు. పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయం వరకు తరలి రాగా, వారందరినీ గేటు బయటే నిలిపి వేశారు. అభ్యర్థి వెంట కేవలం నలుగురిని మాత్రమే పంపించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ రెండు సెట్లలో నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి సెట్ ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, తదితరులతో కలిసి, మరొక సెట్ తండ్రి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, తల్లి, భార్యతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొంకటి లింగమూర్తి రెబల్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పెద్దపల్లి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు అందజేశారు. దీంతో రెండు రోజుల్లో ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలుకు ఇంకా ఆరు రోజుల సమయం ఉంది.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్



క్రీడాకారులకు బహుమతి అందిస్తున్న స్వామి

బెల్లంపల్లి, ఏప్రిల్ 19: మండలంలోని గొండుగూడ గ్రామంలో దివంగత కుర్సెంగు లక్ష్మణ్ స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతుంది. శుక్రవారం ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీజాయింట్ కన్వీర్ నాతరి స్వామి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. పోచంపల్లి, బోయపల్లి జట్ల మధ్య సెమీ ఫైనల్ మ్యాచ్ జరగగా పోచంపల్లి జట్టు విజయం సాధిస్తుంది. గెలిచిన జట్టుకు నాతరి స్వామి బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు శంకర్, మాజీ సర్పంచు మొగిలి, నాయకులు భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్, వంశీకృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

మున్సిపల్ నీరు వృథా



మంచిర్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎండల కారణంగా భూగర్భ జలాలు అడుగంటి జనం నీటి కోసం అల్లాడుతుంటే ఓ ప్రబుద్ధుడు ఏకంగా తన స్కూటర్‌ను నడిరోడ్డుపైనే కడగడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం మున్సిపల్ నీటితో సదరు వ్యక్తి తన స్కూటర్‌ను శుభ్రం చేయడాన్ని స్థానికులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది.

పచ్చదనంపై పట్టింపేది...!

- ఎండిపోతున్న పట్టణ ప్రకృతి వనాలు
- మొక్కలకు నీరు పోయడంలో అలసత్వం



పాత మంచిర్యాల పట్టణ ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

ఏసీసీ, ఏప్రిల్ 19: పట్టణ ప్రకృతి వనాలు ఎండిపోతు న్నాయి. పట్టణాల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశ్యంతో హరితహారం, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా అర్బన్ ప్లాంటేషన్, పట్టణ ప్రకృతి వనాల పేరుతో విరివిగా మొక్కలు నాటారు. మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో, వెం చర్లు, పార్కుల కోసం కేటాయించిన స్థలాల్లో 15 అర్బన్ ప్లాంటేషన్, పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఒక్కో దానికి రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు నిధులు కేటాయించారు. మొక్కలు నాటడం, మొక్కలకు కర్రలను ఏర్పాటు చేయడం, బోర్‌వెల్, మోటారు సంపు, విద్యుత్ కనెక్షన్, కాంపౌండ్‌వాల్ నిర్మాణం, గేట్, బోర్డులు ఏర్పాటు చేయడం వంటి వాటి కోసం వెచ్చించారు. పట్టణంలో దాదాపు 25 వేల వరకు మొక్కలు నాటారు. రావి, మర్రి, మామిడి, నేరెడు, జమ్మి, కానుగ, వేప తదితర రకాల మొక్కలు నాటారు.

- అధికారుల నిర్లక్ష్యం

మొక్కలను సంరక్షించడంలో మంచిర్యాల మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కనబరు స్తున్నారు. పట్టణ ప్రకృతి వనాల్లో బోర్‌వెల్స్, మోటార్లు, విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ మొక్కలకు నీరు పట్టేందుకు శ్రద్ధ కనబర్చడం లేదు. నీరు లేక మొక్కలు ఎండిపోయినా అధికారులు అటు వైపు చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నీటి సౌలభ్యం లేని స్థలాల్లో నాటిన మొక్కలకు ఎండాకాలంలో అయినా ట్యాంకర్ల ద్వారా నీరు పోస్తే కాపాడే అవకాశం ఉంది.





రాశి వనంలో మాజీ మంత్రి ఇందకరణ్‌రెడ్డి నాటిన మొక్క ఎండిపోవడంతో మిగిలిన బోర్డు, రాశి వనంలో ఎండిపోయిన మొక్కలు



మొక్కలు ఎండిపోవడంతో మిగిలిన సపోర్టు కొయ్యలు

- ఈయేడు ఖరారు కాని హరితహారం లక్ష్యం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ ప్రభు త్వం 2015లో హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించి 2023 వరకు కొనసాగించారు. యేటా నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ఏప్రిల్ నాటికే నర్సరీల్లో మొక్కలను పెం చడం ప్రారంభించి జూన్‌లో మొక్కలను పల్లెలు, పట్టణాల్లో హరితహారం ప్లాంటేషన్‌లో నాటారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారినందున గతంలో అమలు చేసిన హరితహారం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొన సాగిస్తుందో లేదోననే అయోమయం నెలకొంది. ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి హరితహారంపై ఇంకా స్పష్టత రాలేదు.